క్లుప్తంగా

రోటరి సేవలు విస్తరించాలి



ఆర్మూర్‌టౌన్‌: రోటరీ క్లబ్‌ సేవలను విస్తరించాలని క్లబ్‌ డిస్ట్రిక్ట్‌ గవర్నర్‌ శంకర్‌ రెడ్డి నూతన కార్యవర్గాలకు సూచించారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన పెట్స్‌ అండ్‌ సెట్స్‌ కార్యక్రమంలో ఆర్మూర్‌ రోటరి క్లబ్‌ నూతన అధ్యక్షుడు పట్వారి గోపీకృష్ణ, కార్యదర్శి పట్వారి తులసి కుమార్‌కు శంకర్‌ రెడ్డి రోటరి బ్యాచ్‌ను అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మూర్‌ ప్రాంతంలో విద్య, వైద్య రంగాల్లో సేవలందించాలని నూతన కార్యవర్గానికి సూచించారు. జిల్లా అసిస్టెంట్‌ గవర్నర్‌ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



రుద్రూర్‌: కోటగిరిలోని శ్రీవేద హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ డైమండ్‌ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. బోధన్‌ సింగిల్‌ విండో సీఈవో ఉమాకాంత్‌ కులకర్ణి సహకారంతో పరీక్ష అట్టలు, పెన్నులు అందజేశారు. లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు హన్మంత్‌ రావ్‌, తెల్ల రవికుమార్‌, శ్రీ వేద హైస్కూల్‌ ప్రిన్సిపాల్‌ టి, అక్షర, లయన్స్‌ సభ్యులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక



నవీపేట: మండల కేంద్రంలోని లిటిల్‌ ఫ్లవర్‌ పాఠశాలకు చెందిన విద్యార్థిని నవోదయకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్‌ హన్మాండ్లు ఆదివారం తెలిపారు. ఎనిమిదో తరగతి విద్యార్థిని కృతి సహస్ర తొమ్మిదవ తరగతి ప్రవేశానికి రెండు నెలల క్రితం పరీక్ష రాసిందని పేర్కొన్నారు. ఇటీవల వెలువడిన ఫలితాలలో ప్రవేశానికి అర్హత సాధించినట్లు పేర్కొన్నారు.

నిరుపేదలకు చేయూత



నవీపేట: మండల కేంద్రంలోని నిరుపేదలకు దగడ్‌ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు బోయిన్‌పల్లి దగడ్‌ సాయన్న ఆదేశం మేరకు ఆదివారం ఆహారపొట్లాలు, వాటల్‌ బాటిళ్లను ట్రస్టు సభ్యులు అందజేశారు. ట్రస్టు జేవీవీ జిల్లా హెల్త్‌ కన్వీనర్‌ రాజశేఖర్‌, ప్రతినిధులు సురేష్‌, సంపత్‌, అరుణ్‌, సందీప్‌ పాల్గొన్నారు.

ఉగాది నంది పురస్కారాల అందజేత



బోధన్‌: హైదరాబాద్‌లోని కళా నిలయంలో ఆదివారం డాక్టర్‌ నటరాజ రామకృష్ణ శత జయంతిని పురస్కరించుకుని సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో పురోహితులు, వేద పండితులకు ఉగాది నంది పురస్కారాలను ప్రదానం చేశారు. బోధన్‌ మండలంలోని ఏరాజ్‌పల్లి గ్రామానికి చెందిన పురోహితుడు శివశాస్త్రీ జ్యోతిష్యం, వాస్తు వైదిక పురోహిత రత్నం అవార్డుతో పాటు నంది పురస్కారాన్ని అందుకున్నట్లు ఆయన తెలిపారు.



మోర్తాడ్‌: ఏర్గట్ల మండలం తడపాకల్‌ ఉన్నత పాఠశాల తెలుగు పండిట్‌ ప్రవీణ్‌ శర్మను తెలుగు వెలుగు సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు ఆదివారం ఉగాది పురస్కారం అందించి సత్కరించారు. ప్రముఖ కవి విపి చందన్‌రావు, అవధాని గణపతి అశోక్‌ శర్మ, డాక్టర్‌ కాసర్ల నరేష్‌, సమాఖ్య అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావులు ప్రవీణ్‌ శర్మకు ఉగాది పురస్కారం అందించారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని స్మైల్‌ స్కూల్‌ విద్యార్థులు జిల్లాస్థాయి అబాకస్‌ పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు స్కూల్‌ డైరెక్టర్‌ మహమ్మద్‌ రఫీ ఆదివారం తెలిపారు. విశ్వం ఎడ్యుటెక్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్‌ పోటీల్లో విద్యార్థులు గట్టు లేవి, సోహన్‌ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్‌ షబానా గోహర్‌, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

కూరగాయల ధరలు పైపైకి

• ఇబ్బందుల్లో సామాన్యులు



అర్మూర్‌టౌన్‌: కూరగాయల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఆకాశనంటిన కూరగాయల ధరలతో సామాన్యులు ఏమి కొనలేని పరిస్థితి నెలకొంది. నెల రోజుల క్రితం అందుబాటులో ఉన్న కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రధానంగా టమాట, పచ్చిమిర్చి, క్యారెట్‌, బీన్స్‌, బీరకాయ, బెండకాయ ధరలు విపరీతంగా పెరిగాయి. మధ్యతరగతి కుటుంబాలకు కూరగాయలతో పాటు చికెన్‌ ధరలు పెరగడం ఇబ్బందిగా మారింది.

ధరలు మరింత పెరిగే అవకాశం..

ఇటీవల కురిసిన అకాల వర్షాలతో టమాట పంట నష్టపోవడంతో వ్యాపారులు చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి టమాటను దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలు మరికొన్ని రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని విక్రయదారులు అంటున్నారు. మొన్నటి వరకు టమాట కిలో . ధర రూ.10 ఉండేది ప్రస్తుతం కిలో ధర రూ.30 పలుకుతుంది. మిర్చి ధర అయితే ఆకాశాన్ని అంటుకుంది. రూ. 25కిలో ఉన్న మిర్చి నేడు రూ.60 పలుకుతుంది. వీటితో పాటు ఆకు కూరల ధరలు పెరిగిపోయాయి. గతంలో రైతులు టమాటకు ధర లేకపోవడంతో తోటల వద్ద, రోడ్లపై టమాటను పడేసి వెళ్లి పోయేవారు. రబీ సీజన్‌లో రైతులు వరి పంటను సాగు చేస్తున్నందున కూరగాయల పంటలు మార్కెట్‌కు వచ్చే పరిస్థితి లేదు. మార్కెట్‌ కూరగాయల ధరలతో పోలిస్తే పప్పు దినుసుల ధరలు అందుబాటులో ఉండటంతో ప్రజలు వాటివైపే మొగ్గు చూపుతున్నారు.

కూరగాయల ధరలు	మొన్న	నేడు
బీరకాయ	25	80
కాకరకాయ	35	60
బెండకాయ	20	60
మిర్చి	30	50
గోపిపువ్వు	30	50
వంకాయ	20	50
టమాట	10	25

కొనలేని పరిస్థితి..



కూరగాయల ధరలు పెరిగిపోవడంతో ఏమి కొనలేని పరిస్థితి ఏర్పడింది. కూరగాయల ధరలు తక్కువ చేసి ఇవ్వమంటే కొంటే కోను లేకుంటే లేదు అన్నట్లు విక్రయదారులు మాట్లాడుతున్నారు. కూరగాయల ధరలతో పాటు ఆకుకూరల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.

–రాజేంధర్‌, ఆర్మూర్‌

ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి..



కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో కూరగాయలు కొనే పరిస్థితి లేదు. ధరలు ఎందుకు పెరిగాయో అర్థం కావడం లేదు. వారంతపు సంతలో కూరగాయల ధరలు తక్కువగా ఉంటాయి అనుకున్నాను. కానీ అక్కడ కూడా ధరలు ఏమాత్రం తక్కువగా లేవు. ప్రతి కూరగాయల ధరలు పెరిగిపోయాయి. –సాయి, ఆర్మూర్‌

స్పీకర్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు



స్పీకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న చందూర్‌ మండల ప్రజాప్రతినిధులు

రుద్రూర్‌: వర్ని మండలం సిద్దాపూర్‌ రిజర్వాయర్‌ పనుల పరిశీలకు వచ్చిన స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌ రెడ్డిని ఆదివారం చందూర్‌ మండల సర్పంచ్‌లు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. చందూర్‌ జరగబోయే శ్రీరామ నవమి ఉత్సవాలకు రావాల్సిందిగా స్పీకర్‌ను ఆహ్వానించారు. స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన విభాగంలో చందూర్‌ జీపీకి జాతీయ గ్రామ పంచాయతీ అవార్డు వచ్చినట్టు స్పీకర్‌కు తెలియచేశారు. సర్పంచ్‌లు కర్లం సాయరెడ్డి, సత్యనారాయణ, రవి, దేవిసింగ్‌, గంగారాం, ఎంపీటీసీ శ్యాంరావ్‌, విండో చైర్మన్‌ ప్యారం అశోక్‌ ఉన్నారు.

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి



పద్మశాలీ సంఘాల అధ్యక్షులను సన్మానిస్తున్న మండల పద్మశాలీ సంఘం సభ్యులు

కమ్మర్‌పల్లి: పద్మశాలీ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు చింత తిరుపతి అన్నారు. మండలంలోని కోనసముందర్‌లో ఆదివారం నిర్వహించిన మండల పద్మశాలీ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు, ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఇటీవల నూతనంగా ఎన్నికైన ఆయా గ్రామాల అధ్యక్షులను సన్మానించారు.

ఉపాధ్యక్షులు రాజుల కృష్ణమురళి, గురుడు శ్రీకంఠం, ప్రధాన కార్యదర్శి నల్ల భూమేశ్వర్‌, కోశాధికారి పోతు ధరణికుమార్‌, సహాయ కార్యదర్శి అంబల్ల అరవింద్‌, చిలివేరి మురళి, చింత శ్రీనివాస్‌, పోతు లింమూర్తి, చిలివేరి లక్ష్మీనారాయణ, పురుషోత్తం, గణేష్‌ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు

బోధన్‌: భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర రెండో మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని యూనియన్‌ కార్యాలయంలో ఆదివారం ఆయన మహా సభల పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. వచ్చే నెల ఏప్రిల్‌ 2, 3 తేదీల్లో భద్రాది కొత్తగూడెం జిల్లా కేంద్రంలో మహాసభలు జరుగనున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను ముందుకు తెచ్చి, పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. కార్మిక హక్కుల రక్షణ కోసం భవిష్యత్తు కార్యాచరణపై మహా సభల్లో చర్చ ఉంటుందని వెల్లడించారు. ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాయిలు, ప్రతినిధులు, సభ్యులు రాజ్‌కుమార్‌, లక్ష్మణ్‌ గౌడ్‌, నారాయణ గౌడ్‌, పేట సాయిలు, శ్రీధర్‌గౌడ్‌, షేక్‌ నజీర్‌, గంపల పోశెట్టి, దేవిదాస్‌, భూమన్న పాల్గొన్నారు.

సైబర్‌ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



ఎడపల్లి(బోధన్‌): ప్రజలు సైబర్‌ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, ఫోన్‌కు వచ్చే తెలియని లింకులను ఓపెన్‌ చేయవద్దని ఏఎస్సై ఇలియాస్‌ తెలిపారు. మండలంలోని సాటాపూర్‌ గేట్‌ వద్ద ఆదివారం ఆయన ప్రజలకు సైబర్‌ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫోన్‌లకు వచ్చే లింకులను ఓపెన్‌ చేస్తే ఖాతాలో ఉన్న డబ్బులు సైబర్‌ నేరాగాళ్లు మాయం చేస్తారని తెలిపారు. ఖాతాల నుంచి డబ్బులు పోతే వెంటనే దయల్‌ 100కు కాల్‌ చేయాలన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌ శిబిరం ప్రారంభం



మోర్తాడ్‌లో ఎన్‌ఎస్‌ఎస్‌ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్‌, తదితరులు

మోర్తాడ్‌: మోర్తాడ్‌లో జాతీయ సేవా పథకం శిబిరాన్ని ఆదివారం సర్పంచ్‌ భోగ ధరణి ప్రారంభించారు. వారం రోజుల పాటు గ్రామంలో వివిధ సేవా కార్యక్రమాలను ఈ శిబిరం ద్వారా నిర్వహిస్తామని ప్రోగ్రామ్‌ అధికారి భూపతి తెలిపారు. మొదట మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో క్లీన్‌ అండ్‌ గ్రీన్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పెద్దన్న, జిల్లా టెలికం బోర్డు సభ్యుడు తక్కూరి సతీష్‌ పాల్గొన్నారు.

మాక్లూర్‌: మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో ఆదివారం నిజామాబాద్‌ గిరిరాజ్‌ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్‌ 4 ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్‌ శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా నగరంలోని తెలంగాణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ తరపున ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దంత వైద్యులు జమాల్పూర్‌ రాజశేఖర్‌, అలేఖ్య గ్రామస్తులకు దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రోగ్రామ్‌ ఆఫీసర్‌ సుమలత, సర్పంచ్‌ మల్లుభాయి పాల్గొన్నారు..

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత



రెంజల్‌(బోధన్‌): మండల కేంద్రంలోని ఓ బాధిత కుటుంబానికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్‌) చెక్కును ఆదివారం మండల బీఆర్‌ఎస్‌ నాయకులు అందజేశారు. సర్పంచ్‌ మర్ల రమేశ్‌కుమార్‌, బోధన్‌ మార్కెట్‌ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు ధనుంజయ్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు రాము, వేణు, నారాయణ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



బోధన్‌: బోధన్‌ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్‌ చేస్తు పట్టణంలో బార్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 98వ రోజు కొనసాగాయి. దీక్షలో న్యాయవాదులు గంగారెడ్డి, అర్జున్‌ రాండర్‌లు కూర్చున్నారు. సీనియర్‌ న్యాయవాది సీహెచ్‌వీ హన్మంత్‌రావు దీక్షలను ప్రారంభించారు. మంగళవారం దీక్షలు వందో రోజుకు చేరుకుంటున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని న్యాయవాదులు తెలిపారు.

మగ్గం వర్క్‌పై శిక్షణ



రుద్రూర్‌: కోటగిరి మండల కేంద్రంలో పేద మహిళల కోసం ఆదివారం స్వచ్ఛంద సేవా సంస్థ వావ్‌ ఆధ్వర్యంలో మగ్గం వర్క్‌పై శిక్షణ కార్యక్రమాన్ని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు సృజనాత్మక శక్తిని పెంపొందించుకుని, స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. 40 రోజుల పాటు మగ్గం వర్క్‌పై శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షకులు కొత్తపల్లి రమేష్‌, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరాంపూర్‌లో అంగడి ప్రారంభం



మోర్తాడ్‌: ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్‌లో ఆదివారం అంగడిని సర్పంచ్‌ భీమనాతి భానుప్రసాద్‌, వీడీసీ చైర్మన్‌ ఇట్టెడి రాజ్‌కుమార్‌ ప్రారంభించారు. గ్రామస్తులకు వారానికి ఒకసారి తక్కువ ధరకు సరుకులు అందుబాటులో ఉంచడానికి అంగడిని ప్రారంభించామని వారు తెలిపారు. ఎంపీటీసీ ఆడెపు సవిత, ఉప సర్పంచ్‌ క్యాతం దేవేందర్‌, నాయకులు రాజాపూర్ణనందం, రమేష్‌, అంజిరెడ్డి, రాజేష్‌, దేవదాస్‌, శ్రీనివాస్‌, గంగారెడ్డి, సాగర్‌, సత్యం, గంగాధర్‌ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ ఆవరణలో ఆదివారం రాకేష్‌ రెడ్డి చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. పైడి సూచరిత రెడ్డి, మోహన్‌, భూమేష్‌, సురేష్‌ రెడ్డి, సంతోష్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘వర్గీకరణ’ ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం



బోధన్‌లో ఎమ్మార్పీఎస్‌ జెండాను ఆవిష్కరించి. మాట్లాడుతున్న మహాజన సోషలిస్టు పార్టీ నేతలు

బోధన్‌: ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమాన్ని దశలవారీగా ఉధృతం చేస్తామని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కో–ఆర్డినేటర్‌ దల్లా సురేష్‌ పేర్కొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్‌ కాలనీలో ఆదివారం ఆయన ఎమ్మార్పీఎస్‌ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. వర్గీకరణ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ద్రోహం చేస్తోందన్నారు. 31న కలెక్టరేట్‌ ముట్టడి, ఏప్రిల్‌ 4న హైదరాబాద్‌ నగర రహదారులన్నీ దిగ్బంధం వంటి కార్యక్రమాలను తలపెట్టామని తెలిపారు.

నాయకులు లక్ష్మీగారి భూమయ్య, పట్టణ అధ్యక్షుడు తాడెం అబ్బయ్య, శంకర్‌, వినోద్‌, నగేష్‌, వీరయ్య, దేవదాస్‌, మొగులవ్వ, కవిత, హనుమవ్వ పాల్గొన్నారు.

దేవాంగ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



సంఘ నూతన కార్యవర్గ సభ్యులు

రుద్రూర్‌: మండల దేవాంగ సంఘం నూతన కమిటీని ఆదివారం సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా శ్యామ్‌సుందర్‌ పహాడే, ప్రధాన కార్యదర్శి లోగం సురేష్‌, ఉపాధ్యక్షుడిగా ఈర్వ శ్రీనివాస్‌, తోర్తి చందర్‌, కార్యదర్శులుగా మేడం శివకుమార్‌, సంయుక్త కార్యదర్శులుగా దాబా మనోహర్‌, నూతపల్లి వినోద్‌, కాట్రపు శ్రీను, కోశాధికారిగా కాట్రపు గంగరాజు, ఈర్వ నాగరాజు, సలహాదారులుగా ఎంవీ గంగారం, నూతిపల్లి గణేష్‌, బొంబాయి గంగాధర్‌ ఎన్నికయ్యారు. యూత్‌ అధ్యక్షులుగా కాట్రపు గంగాశంకర్‌, కార్యవర్గ సభ్యులుగా మేడం రాకేష్‌, కాట్రపు ప్రసాద్‌, మాక అన్వేష్‌, మేడం వినోద్‌, బల్మి ఉమకాంత్‌ ఎన్నికయ్యారు.

ఏప్రిల్‌ 15న ఎగ్జిబిషన్‌

నిజామాబాద్‌ సిటీ: నగరంలో వచ్చేనెలా ఏప్రిల్‌ 15న 40వ అఖిల భారత వ్యవసాయ, పారిశ్రామిక ప్రదర్శన(ఎగ్జిబిషన్‌) ప్రారంభించడానికి సన్నహాలు చేస్తున్నట్లు సొసైటీ ప్రధాన కార్యదర్శి బంటు రాజేశ్వర్‌ తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల మైదానంలో ఆదివారం వారు ఎగ్జిబిషన్‌ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా బంటు రాజేశ్వర్‌ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం 41రోజుల పాటు ఎగ్జిబిషన్‌ కొనసాగనుందని, ఇందులో 240 వివిధ రకాల స్టాల్స్‌ ఉంటాయని తెలిపారు. సొసైటీ సభ్యులు గంగారెడ్డి, దాసరి నర్సింహులు, వంశీ, మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఉత్సవాలకు రామాలయాలు ముస్తాబు



వేల్పూర్‌: ఈనెల 30న జరుగనున్న శ్రీరామనవమి ఉత్సవాలకు వేల్పూర్‌ మండలంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని వేల్పూర్‌ పడగల్‌, అంక్సాపూర్‌, కోమన్‌పల్లి, పచ్చలనడ్కుడ, లక్కోర తదితర గ్రామాలలోని రామాలయాలను వీడీసీలు, ఆలయకమిటీల ఆధ్వర్యంలో రంగులు, విద్యుత్‌ లైట్లతో ముస్తాబు చేశారు.

1నుంచి ఆలయ వార్షికోత్సవాలు

పెర్కిట్‌(ఆర్మూర్‌): పెర్కిట్‌లో గల శ్రీ రమా సత్యనారాయణ స్వామి ఆలయ అష్టమ వార్షికోత్సవాలను ఏప్రిల్‌ ఒకటో తేదీ నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వేద పండితుడు బల్యపల్లి సుబ్బారావు పంతులు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే స్వామివారి ఉత్స విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు.

హన్మాన్‌ స్వాముల భిక్షాటన



రెంజల్‌(బోధన్‌): మండల కేంద్రంలో ఆదివారం హన్మాన్‌ స్వాములు భిక్షాటన చేశారు. ఓం శ్రీరామ జయరామ జయజయరామా అంటూ వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతు నిత్యావసర సరుకులను సేకరించారు. భిక్షాటన ద్వార సేకరించిన సరుకులతో రామనవమి రోజున గ్రామంలో అన్నదానం నిర్వహిస్తామన్నారు. అలాగే ప్రజలకు రామకోటి పత్రాలను అందించారు.

28న బీఎస్పీ నిరాహార దీక్ష

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌ ధర్నాచౌక్‌లో ఈనెల 28న బహుజన్‌ సమాజ్‌ పార్టీ ఆధ్వర్యంలో ఒక్కరోజు నిరాహార దీక్ష నిర్వహిస్తున్నట్లు బహుజన్‌ సమాజ్‌ పార్టీ నిజామాబాద్‌ అర్బన్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరడి లక్ష్మణ్‌ తెలిపారు. నగరంలోని ఆర్‌ అండ్‌బి అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్పీఎస్సీ గ్రూప్‌ 1 ప్రిలిమ్స్‌ పేపర్‌ లీక్‌ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పేపర్‌ లీకేజీపై సీబీఐ లేదా సిట్టింగ్‌ జడ్జితో విచారణ జరిపించాలన్నారు.నిరుద్యోగులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై, నిరాహార దీక్షను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రాజశేఖర్‌, ఉపాధ్యక్షుడు షకీల్‌ అహ్మద్‌, సభ్యులు నవీన్‌ పాల్గొన్నారు.

సమాచారం..

నేడు పీఎఫ్‌పై అవగాహన

నవీపేట: మండల కేంద్రంలోని లిటిల్‌ ఫ్లవర్‌ పాఠశాలలో సోమవారం ఉద్యోగుల భవిష్య నిధి(పీఎఫ్‌)పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు పాఠశాల కరస్పాండెంట్‌ హన్మాండ్లు ఒక ప్రకటనలో తెలిపారు. పీఎఫ్‌ ఖాతాదారుల సందేహాలను నివృత్తి చేసేందుకు నిజామాబాద్‌ రీజియన్‌ పీఎఫ్‌ కమిషనర్‌ హనుమంతప్ప సదస్సుకు హాజరవుతారని పేర్కొన్నారు. పీఎఫ్‌ ఖాతాదారులు, బీడీ కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అక్బర్‌నగర్‌కు స్పీకర్‌ రాక..

రుద్రూర్‌: మండలంలోని అక్బర్‌నగర్‌ గ్రామానికి సోమవారం స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌ వస్తున్నట్లు బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్ష, కార్యదర్శులు పత్తి లక్ష్మణ్‌, బాల్‌రాజ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు చేపట్టబోయే పనులకు శంకుస్థాపన చేస్తారని వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ధర్మభిక్షానికి ఘన నివాళి



రుద్రూర్‌: గీత కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు చేసిన అమర వీరుడు ధర్మభిక్షానికి గీత పనివారల సంఘం నాయకులు ఘన నివాళులు అర్పించారు. కోటగిరిలో ఆదివారం సంఘం ఆధ్వర్యంలో ధర్మభిక్షం వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గీత కార్మికులు చెట్లు గీసేందుకు వెళ్లడానికి మోపెడ్‌ వాహనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మండల కార్యదర్శి పండరి గౌడ్‌, యాదగిరి గౌడ్‌, సాయగౌడ్‌, గంగాగౌడ్‌, రాజాగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.